సాక్షి నంద్యాల
శనివారం । 22 । జూన్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శుక్ర వారం విజయవాడకు చెందిన వి.దీప్తి కుటుంబ సమేతంగా రూ.1,00,101 విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడం తో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెం దిన వాగ్దేవి సంగీత కళాశాల, ఓం మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ వారు నృత్యాన్ని ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ వెంకట శివప్రసాద్

మహానంది: విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు పదో తరగతి ఫలితాల్లో లక్ష్యాలను సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్ అన్నారు. మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్ర వారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ అంబమ్మ, ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులు ఎంత మంది, ఇంకా చేరాల్సిన వారు ఎంత మంది ఉన్నారనే అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు.

రైతు బజార్లలో టమాట కిలో రూ.62

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని శ్రీనివాసన గర్, టెక్కె రైతు బజార్లలో కిలో టమాట రూ.62కు అందజేస్తున్నట్లు జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహమాన్ శుక్ర వారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో టమాట ధర రూ.100కు చేరు కున్న తరుణంలో వినియోగదారులకు ఉపశ మనం కలిగించేందుకు తక్కువ ధరకే అందు బాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఇప్ప టికే ఓ టన్ను పంపిణీ చేశామని, మదనపల్లె మార్కెట్ నుంచి శనివారం మరో టన్ను పం పిణీ కోసం తీసుకొస్తున్నామన్నారు. కర్నూలు లో ఇప్పటికే పచ్చిమిర్చి సైతం రూ.42కు అం దుబాటులోకి తీసుకొచ్చారని, నంద్యాల జిల్లా కు త్వరలో కేటాయింపు ఉంటుందన్నారు.

26న క్యాంపస్ రిక్రూట్‌మెంట్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ పాసైన అభ్యర్థులకు ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు క్యాంపస్ రిక్రూట్‌మెం ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, టీవీ ఫాస్టనర్స్ లిమిటెడ్, వికాస ఇండస్ట్రీస్, రాణే బ్రేక్ లైనర్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా శ్రీశైలం ఐటీఐలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు బయో డేటా, పదవతరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌పుస్తకం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని రవీంద్ర బాబు తెలిపారు.

మరో మూడు రోజులు చిరుజల్లులు

నంద్యాల(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23, 24, 26 తేదీల్లో అక్కడక్కడా చిరు జల్లులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ.సహదేవ రెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ.నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రత 35.2 - 36.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24.8 - 25.2 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని పేర్కొన్నారు. వాయువ్య దిశగా గంటకు 8-10 కి.మీ వేగం తో గాలులు వీచే అవకాశముందన్నారు.

గోనెగండ్లలో మెదడువాపు వ్యాధి

గోనెగండ్ల: గోనెగండ్లలోని ఒకటో సచివాలయం పరిధిలో మెదడు వాపు వ్యాధి కేసు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. చిన్న పిల్లవాడికి కర్నూలులో వైద్య పరీక్షలు నిర్వ హించి మెదడు వ్యాపు వ్యాధిగా గుర్తించినట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో గోనెగండ్లలో పర్యటిం చారు. మురికి నీరు ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ రోజులు నీటిని ఇళ్లలో నిల్వ ఉంచుకోరాద న్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. అనంతరం ఒకటో సచివా లయం పరిధిలోని కాలనీ వాసులు 60 మందికి రక్త పరీక్షలు చేసి నమూనాలను సేకరించారు.ఈ ఓఆర్టీ నాగేష్, సబ్ యూనిట్ అధికారి సాయిబా బా, పంచాయతీ ఈఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీ బదిలీ

కర్నూలు: ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగరాజు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏపీ డీజీపీ శుక్ర వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన రెండే ళ్లుగా కర్నూలు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తు న్నారు. ఈయనను ఇంటెలిజెన్స్ విభాగానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

మహిళల ఉపాధికి ప్రోత్సాహం

- స్త్రీ నిధి కింద 75,984 మంది మహిళలకు రుణాలు
- ఐదేళ్లలో రూ.385 కోట్ల రుణాల పంపిణీ
- తాజాగా ఇన్సెంటివ్ రూపంలో రూ.1.54 కోట్లు విడుదల
- గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన మహళల జీవన ప్రమాణాలు



స్త్రీ నిధి రుణంతో వెల్దుర్తిలో దుకాణం ఏర్పాటు చేసుకున్న మహిళ

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): స్త్రీనిధితో మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులైన మహి ళలు స్త్రీనిధి యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోనే రుణం చేతికి అందుతోంది. ఈ రుణాలు తీసుకుని 750 రకాల వృత్తుల ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 2021-22, 2022-23 సంవత్సరాల్లో పెద్ద ఎత్తున స్త్రీ నిధి కింద రుణాలు పంపిణీ చేసింది. అంతేకాకుండా మండల సమాఖ్యలు, గ్రామ సం ఘాలకు, గ్రామ సంఘ సహాయకుల(వీవోఏ)లకు ఇన్సెంటివ్‌లు ఇచ్చారు. తాజాగా రూ.1,54,85,000 ఇన్సెంటివ్ రూపంలో అందింది. 2023-24 సం వత్సరానికి సంబంధించింది ఇన్సెంటివ్ కూడా త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది.

ఐదేళ్లలో 75,984 మహిళలకు రుణాలు

స్త్రీనిధి కింద రుణాలు పొంది జీవనోపాధులు అభి వృద్ధి చేసుకొని రాణిస్తున్న మహిళలు జిల్లాలో 75,984 మంది ఉన్నారు. ఇందులో 60 శాతం మం ది గతంలో ఇతర ప్రాంతాలకు వలస పోయేవారు. స్త్రీనిధి 2011 నుంచే ఉన్నప్పటికీ మహిళలకు రుణాలు కల్పించడం అంతంతమాత్రంగానే ఉండే ది. గత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రుణాలు ఇతోధికంగా ఇచ్చారు. ఇన్సెంటివ్ కిందనే రూ.1.50 కోట్లు విడుదల చేయడం విశేషం. ఇదిలా ఉండగా 2024-25లో రూ.127 కోట్లు రుణాలుగా పంపిణీ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు.



రుణాలపై చర్చిస్తున్న పొదుపు మహిళలు(ఫైల్)

పెరిగిన మహిళల జీవనప్రమాణాలు

గత ప్రభుత్వ పాలనలో మహిళల జీవ నప్రమాణం గణనీయంగా పెరిగింది. ఒక వైపు స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పించడం.. మరోవైపు బ్యాంకుల నుంచి స్వయంసహాయక సంఘాలకు లింకేజీ రుణాలు ఇప్పించారు. అంతే గాక 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్ ఆర్ చేయూత కింద రూ.18,770 చెల్లించారు. ఇవన్నీ పొదుపు మహిళల జీవనోపాధుల అభివృ ద్ధికి దోహదపడుతున్నాయి. చీరల వ్యాపారం, కిరాణా దుకాణాలు , పొట్టేళ్ల పెంపకం, జీవాల పెంపకం, పాడి అభివృద్ధి ఆధునిక వ్యవసాయ పనిముట్ల ఇలా అనేక వృత్తుల్లో మహిళలు నేడు విశేషంగా రాణిస్తున్నారు.

ఐదేళ్లు రూ. 385 కోట్ల రుణాలు

సెర్ప్‌లో స్త్రీ నిధి అనేది ఒక బ్యాంకుగా అభివృద్ధి చేశారు. స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్.. వాణిజ్య బ్యాంకుల నుంచి 8 శాతం వడ్డీతో రుణాలు తీసుకొని మహిళలకు 11 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తోంది. ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు ఉండవు. జీఎస్టీ వంటి అసలే లేవు. రుణా లను 24 సమానా వాయిదాల్లో తీర్చాల్సి ఉంది. జిల్లాలో 2019-20 నుంచి ఈ ఏడాది జూలై 31 నాటికి పొదుపు మహిళల జీవనోపాధుల కోసం రూ. 385 కోట్లు రుణాలు పంపిణీ చేయడం విశేషం . తీసుకున్న రుణాన్ని రికవరీ చేసిన తర్వాత మళ్లీ రుణం పొందవచ్చు. గ్రూపుల వారీగా రుణాలు ఇస్తారు. వ్యక్తిగతంగా రూ.10 వేల నుంచి గరిష్ఠం గా రూ.లక్ష వరకు రుణం లభిస్తుంది. 2019-20 నుంచి 2023-24 వరకు 75,984 మంది మహిళలు ఈ రుణాలతో వివిధవృత్తులను అభివృద్ధి చేసుకు న్నారు.



పొదుపు మహిళకు స్త్రీ నిధి కింద పొట్టేలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రెండేళ్ల ఇన్సెంటివ్ విడుదల

స్త్రీనిధి కింద రుణాలు ఇప్పించి జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించే డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బందికి ప్రత్యేక ఇన్సెంటివ్‌లు లభిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2021-22, 2022-23లో పెద్ద ఎత్తున స్త్రీ నిధి కింద రుణాలు పంపిణీ చేసినందుకు రూ.1.80 కోట్ల ఇం టెన్సివ్ విడుదల కావడం విశేషం. 2021-22లో మండల సమాఖ్యలు, గ్రామ సంఘాలు, గ్రామ సం ఘాల సహాయకులకు రూ.86,82,851 ఇన్సెంటివ్ కింద విడుదలైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం లో రూ.93,75,104 విడుదల కావడం విశేషం. రెం డేళ్లలో 1,80,57,955 విడుదలైంది.

48 గంటల్లో రుణసదుపాయం



పొదుపు మహిళలు జీవనోపా ధులను అభివృద్ధి చేసుకునేం దుకు స్త్రీ నిధి రుణాలు చక్కగా ఉపయోగపడుతున్నాయి. స్త్రీ నిధి అనే యాప్ కూడా ఉంది. ఈ యాప్ ద్వారా లోన్ కోసం దరఖాస్తు వస్తే 48 గంటల్లోనే మంజూరవుతుంది. 750 రకాల వృత్తులలో దేని లోనైనా రాణించవచ్చు. 2019-20 నుంచి 2022-23 వరకు రూ. 385 కోట్ల రుణాలు ఇచ్చాం. తీసుకున్న రుణాలను 11 శాతం వడ్డీతో 24 సమానా వాయి దాల్లో చెల్లించాల్సి ఉంది.

– శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

స్నాతకోత్సవానికి వేళాయె!

- నేడు ట్రిపుల్‌ఐటీ డీఎంలో కాన్వొకేషన్
- 2020-24 బ్యాచ్ విద్యార్థులకు బీటెక్ పట్టాల అందజేత
- ఐదుగురికి బంగారు పతకాల ప్రదానం



ట్రిపుల్ ఐటీడీఎం ముఖద్వారం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇండియన్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం)లో నేడు(శని వారం)6వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ట్రిపుల్‌ఐటీ డీఎంకు పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిం ది. మొదటగా ఈ విద్యా సంస్థ కాంచీపురం(తమిళ నాడు) మెంటర్ ఇనిస్టిట్యూట్‌గా 2015 ఆగస్టు నెలలో ప్రారంభమైంది. మూడు బీటెక్ కోర్సులతో తరగతు లు మొదలయ్యాయి. ఆ తరువాత మరో కోర్సుతో క లిపి మొత్తం నాలుగు కోర్సులతో ఏటేటా ఎంతో మం ది యువ ఇంజినీర్లను ఈ సంస్థ తయారు చేస్తోంది.

అన్ని రకాల వసతులు

కాంచీపురం నుంచి 2018లో ట్రిపుల్ ఐటీ డీఎంను కర్నూలుకు తరలించారు. నగర శివారులోని జగన్నా థగట్టుపై 151 ఎకరాల స్థలంలో శాశ్వత క్యాంపస్‌ను నిర్మించారు. గట్టులో లోయలు, ఎత్తు పల్లాలు ఉన్న ప్పటికీ ఆర్కిటెక్చర్ నైపుణ్యంతో కట్టిన భవనాలతో క్యాంపస్ సరికొత్త కళను సంతరించుకుంది. దేశంలో ఉన్నటువంటి 25 ట్రిపుల్ ఐటీల్లో కర్నూలు ట్రిపుల్‌డీ ఎం అనతికాలంలోనే పేరుగాంచింది.

143 మందికి బీటెక్ పట్టాలు

స్నాతకోత్సవంలో 2020-24 బ్యాచ్‌కి చెందిన బీటెక్ విద్యార్థులకు 143 మందికి పట్టాలు అందించను న్నారు. ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యులు, జవ హర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వీసీ డాక్టర్ విజ య్‌కుమార్ సరస్వత్ హాజరుకానున్నారు.

డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: డయేరియా నియంత్రణపై ప్రజల్లో అవ గాహన కల్పించేలా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివా సులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అతిసారం కేసుల వ్యాప్తికి అడ్డుకట్ట (స్టాప్ డయేరియా క్యాంపెయిన్), తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టరేట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, సంబంధిత అధి కారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనం తరం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో డయేరియా నియంత్రణ, వ్యక్తిగత పరిశు భ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధి కారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడా అతిసారం కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసు కోవాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీలలో ఓఆర్ ఎస్ ప్యాకెట్లు/జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాల న్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించ డంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం, తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందిం చడం చేయాలన్నారు. ఎక్కడా అతిసారం కేసులు వ్యాప్తి చెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీటి వనరుల్లో నీటి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వివిధ డ్రైన్ల మీదుగా వెళ్లే తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, ఓహెచ్‌ఎస్‌ఆర్ లను కూడా పూర్తిగా తనిఖీ చేసి లీకేజీలను నియం త్రించాలన్నారు.

పంటల సాగుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కర్నూలు డీఏవో సురేష్

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావ డంతో వ్యవసాయాధికారులు పంటల సాగుపై రైతు లకు అవగాహన కల్పించాలని కర్నూలు, నంద్యాల జిల్లా వ్యవసాయాధికారులు సురేష్, మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సమావేశ మందిరంలో సహ సం చాలకురాలు డా.సరళమ్మ అధ్యక్షతన శిక్షణ సంద ర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల డీఏవోలు, సహాయ వ్యవసాయ సం చాలకులు తమ పరిధిలో సాగైన పంటల రకాలు, విస్తీర్ణం, వర్షపాతం వివరాలు వివరించారు. ఈ సం దర్భంగా పరిశోధనా స్థానం వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు ఎన్‌డీఎల్‌ఆర్-7, ఎంటీయూ 1271, బీపీటీ 2846 రకాలు అగ్గితెగులును తట్టుకోవడంతో పాటు గాలి వానకు గింజ రాలకుండా నిలిచి అధిక దిగుబడులని స్తాయన్నారు. పొగాకు శాస్త్రవేత్త డాక్టర్ పుల్లిబాయ్ మాట్లాడుతూ.. పొగాకు నారు పోసుకోవటానికి జూలై రెండో వారం, నాటుకోవటానికి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అనుకూలమని వివరిం చారు. పత్తి శాస్త్రవేత్తలు మోహన్ విష్ణు, లక్ష్మి కళ్యాణి, శివరామకృష్ణ మాట్లాడుతూ.. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసే రైతులు 90×15 సెం.మీ లేదా 90×30 సెం.మీ దూరంలో విత్తుకోవచ్చని సూచించారు. పొద్దుతిరుగుడు ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాత, చిరుధాన్యాల శాస్త్రవేత్త డా.నరసిం హులు మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు, కొర్రలో స్వల్పకాలిక రకాలపై అవగాహన కల్పించారు. మృ త్తికా శాస్త్రవేత్త డా.సతీష్ కుమార్ మాట్లాడుతూ..పొ గాకు పంటకు అవసరమైన క్లోరైడ్ పరీక్ష, భూసార పరీక్షలు, నీటి పరీక్షలు పరిశోధనా స్థానంలో అందు బాటులో ఉన్నాయని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా విశిష్టతను వివ రిస్తూ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా నం ద్యాల ఆయుష్ విభాగం వారు పద్మావతి నగ ర్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన యోగ శిక్షణా కార్యక్రమంలో జాయిం ట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీని వాసులు మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుం డా యోగా చేయడం వలన శారీరక, మానసిక సామర్థ్యం పెరగడంతో పాటు మనసు, శరీరం సమతుల్యమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకుని ఆనందంగా జీవించవచ్చునన్నారు. ఆధు నిక జీవన శైలిలో భాగంగా ప్రతి ఒక్కరు కూర్చొని చేసే పనులు అధికంగా ఉండటం వల్ల నడుము నొప్పి, మెడ నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. రోజూ యోగా చేయడం వలన అనేక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోదర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రాజు ఆయుష్ శాఖ సిబ్బంది, న్యూక్లియస్ కాలేజీ విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో యోగాసనాలు వేస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు, విద్యార్థులు





యోగాసనాలు వేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు, యోగా ఆసనం వేసిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

బొమ్మలసత్రం: నిత్యం యోగా చేయటం వల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయ ఆవ రణలో పాఠశాల విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఎస్పీ యోగాసనాలు వేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మనిషి ఉరుకుల పరుగుల జీవితం లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్య, చేస్తున్నారని దీని కోసం మహర్షులు యోగా సాధనను మనకు అందించారని వివరించారు. యోగా సాధనను చిన్న తనం నుంచే చిన్నారులకు నేర్పించేలా చూసే బాధ్యత తల్లిదం డ్రులదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో శుక్రవారం ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.16,600, మోడల్ ధర రూ.14,000, కనిష్ఠ ధర రూ.11,500గా నమోదై నట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకట నలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపార స్తుల వద్ద సరకు అమ్ముకుని మంచి ధరను పొం దాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

మిడుతూరు: నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని చౌట్కూరు, మాసపేట మజారా గ్రామం ఉప్పలదడియ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సబ్సిడీ కింద కంది విత్తనాలు, ఫర్టిలైజర్ బస్తాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులకు నాణ్య మైన విత్తనాలు, ఎరువులు అందించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. రైతులకు సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబా టులో ఉన్నాయా? నీటి వనరులు ఏ విధంగా ఉన్నాయి? ఈ ప్రాంత భూములలో ఏ పంటలు పండుతాయి? ఏ పంటను అధికంగా సాగు చేస్తు న్నారు? అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్, నాయకులు కమతం జయరామిరెడ్డి, వీరారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొ న్నారు. అలాగే మాసపేట గ్రామ పరిధిలో నూత నంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకును ఆకస్మికంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దాదాపు నెల క్రితం నూతన పెట్రోల్ బంకు (నయారా) ఏర్పాటుకు మౌలాలి అనే యజమాని అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు మేరకు పెట్రోల్ బంకును తనిఖీ చేసేం దుకు వచ్చినట్లు వెల్లడించారు. జేసీ వెంట డీఎస్‌ఓ వెంకట్రాముడు, తహసీల్దార్ తులశమ్మ, డిప్యూటీ తహశీల్దార్ షానవాజ్, ఆర్‌ఐ మహమ్మద్ హుస్సేన్, వీఆర్వో రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.



రైతులకు ఎరువుల బస్తా అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

వైభవంగా శ్రీశైల గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయ బద్ధంగా నిర్వహించిం ది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహా మంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరే గింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండ పం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్ బెడ్, సిద్దరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తు లకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమంలో శ్రీశైల దేవ స్థాన అధికారులు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.



స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

చాబోలులో ప్రబలిన అతిసారం

- 30 మందికి తీవ్ర అస్వస్థత
- బాధితుల్లో అధికంగా చిన్నారులు
- కర్నూలు, నందికొట్కూరు ఆసుపత్రులకు తరలింపు



తాగునీటి ట్యాంకులో కొంగ కళేబరం



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు మజారా గ్రామమైన చాబోలులో అతిసార వ్యాధి ప్రబలింది. వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి గ్రామానికి చెందిన 30 మంది అతిసారం బారిన పడ్డారు. వీరిలో ఐదేళ్లలోపు వయస్సున్న శ్వేత, హని, సురేష్, సుమంత్‌తో పాటు మరొకరు నందికొట్కూరు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. రోహిత్, దక్షిత్, ధాత్రి, బెనితాలను తల్లిదండ్రులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడ చికిత్సలు చేయిస్తున్నారు. మిగిలిన వారు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్నారు. పారుమంచాల డాక్టర్ యశశ్విని, డాక్టర్ గంగాధర్, హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, వైద్యసిబ్బంది గురువారం రాత్రి నుంచే వైద్యశిబిరం నిర్వహించి బాధితులకు చికిత్స నిర్వహిస్తున్నారు.

గ్రామాన్ని సందర్శించిన అధికారులు

విషయం తెలుసుకొన్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు మంజుల, సామేలు, గ్రామంలో పర్యటించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. అలాగే అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి, రాష్ట్రీయ బాలల శిశుసంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ కాంతారావునాయక్ చాబోలు గ్రామంలో పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకొన్నారు. వారికి డయేరియా ప్రబలడానికి గలకారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఇకపై కాచివడగట్టిన మినరల్‌వాటర్ మాత్రమే తాగాలని, మజ్జిగ, టెంకాయనీళ్లు తాగడంతో పాటు చారు అన్నం మాత్రమే తినాలని వారు బాధితులకు సూచించారు. ఆరోగ్యం ఇబ్బంది కరంగా ఉంటే వెంటనే వైద్యశిబిరంలో వైద్యం చేయించుకోవాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు గ్రామంలో ఇళ్లిళ్లు తిరిగి క్లోరైడ్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయటంతో పాటు ఎప్పటికప్పుడు గ్రామస్తుల ఆరోగ్యస్థితిగతులు తెలుసుకోవాలని ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం: జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారిణి మంజులవాణి

చాబోలు గ్రామానికి చేరుకొని డయేరియా వ్యాప్తికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామంలోని ట్యాంకులను ఎన్నిరోజులకోసారి శుభ్రం చేస్తున్నారు? ఎంతమంది ట్యాంకుల్లోని నీటిని తాగుతున్నారు? అనే విషయాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీఓ మంజులవాణి విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో 80 శాతం మంది మినరల్‌వాటర్‌ను తాగుతుండగా మిగిలిన 20 శాతం మంది మాత్రమే ట్యాంకుల నీటిని తాగుతున్నట్లు తెలిసిందన్నారు. ట్యాంకులను శుభ్రం చేయించడం,క్లోరినేషన్ చేయించడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే తాగునీటి ట్యాంకులో కొంగ పడి చనిపోయి నీళ్లు కలుషితమైనట్లు గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనేది తేలితే పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తాగునీటిశాఖ డీఈ విద్యాసాగర్, ఏఈ నాగేంద్ర గ్రామంలో పర్యటించి గ్రామంలోని తాగునీటి ట్యాంకులు, బోర్లలోని నీటిని సేకరించి శ్యాంపిల్స్ నిమిత్తం ల్యాబ్ పంపించినట్లు తెలిపారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

మహిళకు గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆర్టీసీ బస్సు ఢీకొని సున్నిపెంటకు చెందిన పిచ్చమ్మ (66) తీవ్రంగా గాయపడింది. స్థానిక బస్టాండ్ వెనుక ప్రాంతంలో నివసిస్తున్న పిచ్చమ్మ బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కర్నూలు 1డిపోకు చెందిన ఆర్టీసి బస్సు టైర్ ఎక్కడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. సున్నిపెంట ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అబ్దులాపురంలో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు

కొలిమిగుండ్ల: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో టీడీపీ నాయకులు గొడవలకు ఆజ్యం పోస్తున్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలోని అబ్దులాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. అంగన్‌వాడీ ఆయాను తొలగించేందుకు గ్రామ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఐసీడీఎస్ అధికారులు విచారణకు వచ్చారు. ఆయా పనితీరుపై ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల తల్లులతో విచారణ చేయడంతో మహిళలు గుడ్లు, ఇతర సరుకులు సక్రమంగా అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన లక్ష్మీనాయుడు కోడలు సునంద ఆయా పనితీరుపై అనుకూలంగా వివరించింది. ఎన్నికల సమయంలో పార్టీ మారడం, ఆయా విషయంలో అనుకూలంగా అధికారులకు చెప్పడంతో టీడీపీ నాయకులు కక్ష సాధింపునకు దిగారు. గ్రామ టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, మల్లికార్జున రెడ్డి, రాంభూపాల్‌తో పాటు పలువురు అంకిరెడ్డిపల్లె నుంచి మూడు వాహనాల్లో టీడీపీ కార్యకర్తలను అబ్దులాపురానికి పిలిపించుకున్నారు. ఇంట్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మీనాయుడును బయటకు లాగి వీధి వెంట ఈడ్చుకొని కొట్టుకుంటూ వచ్చారు. గ్రామం మధ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టేలా దుర్భాషలాడటం, సవాల్ విసిరారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారిపై ఎదురు దాడికి దిగారు. రాళ్లదాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన శివారెడ్డి, రేణుక, అపర్ణ, రాజేంద్రప్రసాద్, శంకరయ్యతో పాటు పలువురు గాయపడ్డారు. ఇరువర్గాల ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని విచారించారు. గాయపడిన వారిని చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దేవపూజ ధనుంజయ ఆచారి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి కోరారు. జిల్లాకు పరిశ్రమల శాఖ మంత్రి పదవి రావడం శుభ పరిణామమని, ఈ నేపథ్యంలోనే పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూ రు, పత్తికొండ నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల ప్రజలు పనుల్లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతుంటారన్నారు. గుజరాత్ రాష్ట్రంలో జరుగుతున్న విధంగా గ్రామాల్లో యువతను ప్రోత్సహించేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ క్వార్ట ర్స్‌లో కొనసాగుతున్న బీసీ భవన్‌కు నూతన భవనాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

శ్రీశైలంలో విశేష పూజలు



స్వామిఅమ్మవార్లకు హారతి ఇస్తున్న పండితుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆమె విధులు నిర్వహించారు. ఇకపై రెగ్యులర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఆమెతో పాటు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమణికి సైతం గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఆమె అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు.సావిత్రిబాయిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ వసతి గృహంలో 100 మంది విద్యార్థులకు వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన శారీరక వికలాంగులైన విద్యార్థులు తమ దరఖాస్తులను వసతి గృహ సంరక్షకునికి అందజేయాలన్నా రు. మరిన్ని వివరాలకు సెల్: 8639152178, కార్యాలయ ఫోన్: 08518-277864 నంబర్లను సంప్రదించాలన్నారు.

హత్యకేసు నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరురూరల్: కురుకుంద గ్రామంలో ఈనెల 17న జరిగిన షేక్ ఖాదర్ వలి హత్య కేసులో నిందితుడు గువ్వలకుంట్ల ఫారూఖ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హతుడు షేక్ ఖాదర్, నిందితుడు ఫారూఖ్ మరికొందరు హైదరాబాద్‌లో కొవ్వా, బన్ను వ్యాపారం చేసేవారు. బక్రీద్ సందర్భంగా వారు సొంత స్థలాలకు తిరిగి వచ్చే క్రమంలో ఫారూఖ్ నడుపుతున్న ఆటో ఏస్ వాహనంలో సీట్ల సర్దుబాటులో వారి మధ్య గొడవ జరిగింది. ఆతర్వాత మరుసటి రోజున రాత్రి మద్యం సేవించి కురుకుందలో ఇద్దరు వాగ్వాద పడ్డారు. దీంతో ఆవేశంలో ఫారూఖ్ కత్తితో ఖాదర్ వలిని పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందా డు. నిందితుడు ఫారూఖ్ కురుకుంద హైస్కూల్ సమీపంలో ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, ఎస్‌ఐ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: మండలంలోని నారాయణపురం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబు(30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలం నగరడోణ గ్రామానికి చెందిన బాబు గత ఎనిమిదేళ్ల నుంచి ఆదోని పట్టణంలోని అరుంజ్యోతినగర్ నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆలూరు వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహ నం ఢీకొట్టింది. ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.